క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్, బాలసముద్రం, నిట్, వెస్ట్ సిటీ, మడికొండ, టేకులగూడెం, న్యూశాయంపేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని ఆజంజాహి మిల్స్, స్టేషన్‌రోడ్డు, ఖిలా వరంగల్, శంభునిపేట, మామునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ ఒక ప్రకటనలో వివరించారు.
హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా హసన్‌పర్తి, భీమారం, కే.సీ.క్యాంప్, కోమటిపల్లి, భద్రకాళినగర్, ఎర్రగట్టుగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేత్రదానం


పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్ అబ్బనికుంటకు చెందిన మాజీ కౌన్సిలర్ బూర కట్టమల్లు (79) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, మాజీ కౌన్సిలర్ సతీమణి, కుమారుల అనుమతితో మృతుడి నేత్రాలను తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకుంటే 87905 48706, 97037 38699 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్, సురేందర్, జితేందర్, మహేందర్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షులు కొండ్రెడ్డి మల్లారెడ్డి, శంకర్‌రావు యాదవ్, ఉపేందర్ రెడ్డి, రాజమౌళి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేదారి తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రానికి వృద్ధురాలి తరలింపు



ఖిలా వరంగల్: కుటుంబానికి దూరమైన 65ఏళ్ల వృద్ధురాలు.. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖమ్మం జాతీయ రహదారిపై కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు ఆ వృద్ధురాలిని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు శుక్రవారం ఉదయం తరలించారు. ఆమె కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఎలాంటి సమాచారం రాకపోవడంతో సఖి కేంద్రానికి తరలించారు. వృద్ధురాలి గురించి తెలిస్తే మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌తోపాటు వరంగల్ సఖి కేంద్రానికి సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

గురుకులాల్లో చేర్పించాలి

న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో పిల్లలను చేర్పించాలని అధికారులు కోరారు. ఈమేరకు హనుమకొండ నగర పరిధిలోని మసీదులలో కరపత్రాలు పంచుతూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గురుకులాల్లో అధునాతన సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు వివరించారు. 5, 6, 7, 8వ తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆర్ఎల్‌సీ శ్రీపాల, ప్రిన్సిపాల్ వందన, కౌన్సిలర్ సర్వర్ మొహినొద్దీన్, సుల్తాన్ పాల్గొన్నారు.

ఈ-శ్రామ్ కార్డు పొందాలి



కాజీపేట: అర్హులైన ప్రతీ కార్మికుడు తప్పనిసరిగా ఈ-శ్రామ్ కార్డుతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ డాక్టర్ సామ్యెల్ జాన్ సూచించారు. కాజీపేట 63వ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు యమడాల అనుకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్, ఈ-శ్రామ్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లె నవీన్ కుమార్, కందుల ప్రమీల, బి.శంకర్, ఇసంపెల్లి కుమారి, అంజలి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైల్వే కార్మికుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ముఖ్యఅతిథిగా రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ డీఈఈ అభిషేక్‌మిశ్రా పాల్గొని ఇంజనీరింగ్ జట్టు - కమర్షియల్ జట్ల మధ్య మ్యాచ్‌ను టాస్‌వేసి ప్రారంభించారు.

కోచ్ ఫ్యాక్టరీ సాధన పోరాటంలో
రైల్వే రిటైర్డ్ ఉద్యోగులే కీలకం


కాజీపేట: కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ విప్

కాజీపేట: రానున్న రోజుల్లో తెలంగాణ ఉద్యమ స్థాయిలో చేపట్టనున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధన పోరాటంలో రిటైర్డ్ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని, ఈక్రమంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయ భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు తను కూడా చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం, సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పి.కృష్ణమూర్తి, కార్యదర్శి జి.సుధాకర్ రావు, కోశాధికారి పి.చంద్రమోహన్, కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఎలకంటి రాములు, నాయకులు కాటపురం రాజు, సుంచు కృష్ణ, సుంచు అశోక్, పి.శివకుమార్, రావుల సదానందం, బి.రంజిత్ కుమార్, రఘురాం పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపన
కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలో, బాలాజీనగర్‌లో రూ.30 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, డివిజన్ అధ్యక్షుడు దువ్వ కనకరాజు, నాయకులు నార్లగిరి రమేష్, సుంచు కృష్ణ, కాటమరాజు, సిరిల్‌లారెన్స్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివ, 63వ డివిజన్ అధ్యక్షుడు రంజిత్, కాలనీ సెక్రటరీ బొట్టు రాజు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి పోతురాజు బాబు కుమారస్వామి, రంగయ్య, వెంకటస్వామి, తిరుపతి, రఘు, వెంకటస్వామి పాల్గొన్నారు.

మాలకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తా
అన్ని కుల సంఘాల అభివృద్ధితో పాటు మాలకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ పోచమ్మగుడి ప్రాంగణంలో తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్ ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్‌ను చీఫ్‌విప్ శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న బాపూజీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కాంపెల్లి లక్ష్మణ్‌ను చీఫ్‌విప్ పరామర్శించారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హనుమకొండలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2020 పీఆర్సీ ఏరియర్స్ బకాయిలను 18వాయిదాల్లో నెలనెల విడుదల చేయాలని సూచించారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. అలాగే, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వీలైనంత తొందరగా విడుదల చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీటీఎఫ్ హనుమకొండ మండల అధ్యక్షుడు మురళి, కార్యదర్శి రాజ్‌కుమార్, అధ్యాపక జ్వాల సంపాదకులు సుదర్శన్‌రెడ్డి, బాధ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కొనియాడారు. 2వ డివిజన్ డివిజన్ వంగపహాడ్‌లో సుమారు రూ.1.46కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొటర్ రవినాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు జంగా కుమార్, నరేడ్ల శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గు రాజేష్, గోపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మధు, మన బడి - మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, వంగపహాడ్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మండల పరిషత్ మాజీ కోఆప్షన్‌సభ్యుడు మొయినొద్దీన్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు.

బీఆర్ఎస్‌లో భగ్గుమన్న విబేధాలు
2వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీలో విబేధాలు భగ్గుమన్నాయి. వంగపహాడ్‌లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీలో తమకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన ఎదుట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌తో పాటు మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు.

‘కబ్జాదారుల కొమ్ముకాస్తున్న పోలీసులు’


రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

రామన్నపేట: కబ్జాదారులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్ ఆరోపించారు. మట్టెవాడ శివారు ప్రాంతంలోని 373, 374, 375, 376, 378 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. దాంతో వారిని పోలీసులు చెదరగొట్టడంతో గోపాలస్వామి గుడి వద్ద బాధితులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పేదలపై పోలీసులు జులుం చేయడం హేయమైన చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై కేసులు పెడుతున్న పోలీసులు.. ప్రభుత్వ భూములను కబ్జాదారులు కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముతుంటే మాత్రం చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యులు సంద్రకుమార్, పరికిరాల రమేష్, బూజుగుండ్ల రమేష్, షబానా, అంజాద్, ప్రసాద్, స్వప్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23న జాబ్‌మేళా

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 23న ములుగు రోడ్డులోని ఐటీఐ క్యాంపస్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువనాథ్ సోలిసన్స్ కంపెనీలో టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా హైదరాబాద్, వరంగల్‌లో పని చేయడానికి దాదాపు 65 మంది ఎంపికకు జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న వారు తమ అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని, పూర్తి సమాచారం కొరకు 89784 93699 లేదా 99123 41819 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

‘మత్స్య’ సభ్యత్వాలకు స్పెషల్ డ్రైవ్

గీసుకొండ: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో కొత్తగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని, ఏప్రిల్ మొదటి వారం వరకు ఈ అవకాశం ఉందని మత్స్య శాఖ జిల్లా అధికారి నరేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 18 ఏళ్ల వయసు పైబడిన వారు సంబంధిత మత్స్య సంఘం వారితో సభ్యుడిగా నమోదు కోసం తీర్మానం చేయించుకుని, ఆ ప్రతులను తమకు పంపాలన్నారు. అలాంటి వారికి చెరువుల్లో వల వేయడం, పెద్ద వల లాగడం, ఈత కొట్టడం లాంటి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామని, అందులో ఎంపికైన వారికి సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తామని పేర్కొన్నారు. పెద్ద జలాశయాలు, రిజర్వాయర్ల మత్స్య సంఘాల సభ్యత్వం కోసం వల వేయడం, పెద్ద వల లాగడం, ఈత కొట్టడంతోపాటు వల అల్లడం లాంటి నైపుణ్యాలను పరీక్షించి ఎంపిక చేస్తామన్నారు. సభ్యత్వం కోసం రూ.51 రుసుము చెల్లించాలన్నారు. సంఘంలో మృతి చెందిన సభ్యుల స్థానాలను భర్తీ చేయడానికి ఇదే ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

23, 24 తేదీల్లో ఆల్ పెన్షనర్స్ మహాసభలు


మాట్లాడుతున్న పెండ్యాల బ్రహ్మయ్య

నయీంనగర్: ఈనెల 23, 24 తేదీల్లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ అర్బన్ జిల్లా 6వ మహాసభలను హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్ష, కన్వీనర్లు అడ్లూరు నరసింహమూర్తి, తూపురాణి సీతారాం తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్స్, కార్మిక వ్యతిరేఖ విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు రావాల్సిన 3 వాయిదాల కరువుభత్యం ఇంకా ప్రకటించలేదని తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ కింద వైద్యం అందడం లేదని వాపోయారు. కార్యక్రమంలో పి.బ్రహ్మయ్య, నరసింహస్వామి, సంపత్‌కుమార్, మల్లిక, వీరన్న, నిర్మల, సంజీవరావు పాల్గొన్నారు.

‘కళాకారుల’ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాజాసాహెబ్

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బ్యాండ్ వాయిద్య కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజాసాహెబ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా తమను పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాండ్ వాయిద్య కళాకారులు సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధనకు జిల్లాలు, మండలాల వారీగా కమిటీలు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో పలు జిల్లాల అధ్యక్షులు అంకూస్, యాదగిరి, హుస్సేన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దండోరా సభను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశిబుగ్గ: కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించనున్న దళిత, గిరిజన ఆత్మగౌరవ దండోరా సభను విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ రేణుకుంట్ల శివకుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు 35వ డివిజన్ శివనగర్‌లో సభ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో దళిత, గిరిజన, బహుజనులపై అనేక రకాల దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరగారి ప్రీతం అధ్యక్షతన సభకు ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ నల్గొండ రమేష్, ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డబ్బెట రమేష్, మహిళా కన్వీనర్ కూరాకుల భారతి, నరుకుడు వెంకటయ్య, బొడ్డు అనిల్‌కుమార్, దాసరి రాజేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ‘శ్రీచైతన్య’ విద్యార్థులు


విజేతలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

హన్మకొండ అర్బన్ / కాజీపేట అర్బన్: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (కాట్)లో హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. జాతీయ స్థాయిలో మొత్తం 300మంది విద్యార్థులు పాల్గొనగా చైతన్య నక్కలగుట్ట బ్రాంచి నుంచి 42మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రూ.46 వేల నగదు బహుమతి, ప్రశంసపత్రాలు అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఇన్‌చార్జ్ రమేష్, ఉదయ్‌భాస్కర్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చైతన్, కోఆర్డినేటర్ మహేష్, రాంకీ ఉన్నారు.

24న మార్కండేయ మహర్షి శోభాయాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్: పద్మశాలీల కులదైవమైన మార్కండేయ మహర్షి జయంతి సందర్భంగా ఈనెల 24న నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త రామా శ్రీనివాస్ కోరారు. కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మార్కండేయ మహర్షి జయంతి శోభాయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశిబుగ్గ మార్కండేయ స్వామి గుడి నుంచి కాజీపేట వరకు శోభాయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో కార్పొరేటర్ నరేంద్ర కుమార్, పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, బాల్నే శరత్, బాసాని చంద్రప్రకాశ్, బేతి అశోక్, మంతెన రమేష్, డాక్టర్ కూరపాటి రమేష్, అడ్వకేట్ దుస్సా జనార్దన్, వలుస సుధీర్, శామంతుల శ్రీనివాస్, గోరంట్ల రాజు, యెలుగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలి


లైసెన్స్ పత్రం అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై డేవిడ్

వరంగల్ చౌరస్తా: ఆటోడ్రైవర్లందరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఎస్సై డేవిడ్ సూచించారు. వరంగల్ 27వ డివిజన్‌లోని రాంకీ అడ్డా వద్ద ఆటో డ్రైవర్లకు లైసెన్స్ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు తప్పకుండా యూనిఫాం వేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 26నుంచి 28వరకు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, బీఆర్ఎస్ నాయకులు చింతాకుల సునీల్, అసోసియేషన్ నాయకులు ఇసంపెల్లి సంజీవ, దేవర మల్లేష్, మడికొండ బాబు, వెంకన్న, అంకుషావళి, ఖాజా, అబ్బాస్, రవీందర్ పాల్గొన్నారు.

నేత్ర సమస్యల పరిష్కారానికే ‘కంటి వెలుగు’


వృద్ధాశ్రమంలో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వరంగల్: ప్రజల కంటి సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ‘కంటి వెలుగు’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 3వ డివిజన్ పైడిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. కార్పొరేటర్ జన్ను షీబారాణి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో కంటి పరీక్షలు
హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పరిధి పెద్దమ్మగడ్డలోని స్వయంకృషి మహిళా సొసైటీ వ్యవస్థాపకురాలు తీగల శోభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. పెద్దమ్మగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొని 40 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు సరిత, ప్రమీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రైవేట్ ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం
హన్మకొండ: కరోనాతో ఇన్‌ఫెక్షన్ బారినపడి రెండు కాళ్లు కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు రామచందర్‌కు ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు, జిల్లా చైర్మన్ దారబోయిన సతీష్ చేయూతనందించారు. హనుమకొండలోని స్వగృహంలో రామచందర్‌ను శుక్రవారం పరామర్శించి రూ.5 వేలు అందించారు.

ఆల్వార్‌దాస్‌కు నివాళి
విద్యారణ్యపురి: హనుమకొండలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు ఆల్వార్‌దాస్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్వార్‌దాస్ చిత్రపటానికి అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అనంత్, రమేష్, ఉమేష్, సత్యనారాయణ, సురేందర్ పాల్గొన్నారు.

కోటను సందర్శించిన ఎన్ఆర్ఐలు
ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ మధ్యకోటను అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐలతో కలిసి నగర మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు అద్భుతమైన శిల్పకళా సౌందర్యాన్ని ఆసక్తిగా తిలకించారు.

వ్యవసాయ మార్కెట్‌లో వైద్య శిబిరం
వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైదరాబాద్ సోమాజీగూడకు చెందిన యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దడువాయిలు, కార్మికులు, రైతులు, వ్యాపారులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం
కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మూల నక్షత్రం, మాసశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ విశ్వేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి ఆలయ ఆవరణలోని యాగశాలలో సామూహిక చండీహోమం నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం కార్యవర్గం
హన్మకొండ కల్చరల్: విశ్వబ్రాహ్మణ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సిద్దోజు విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా శ్రీపాద సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల దేవాచారి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్, కోశాధికారిగా మట్టెవాడ బ్రహ్మచారి, డైరెక్టర్లుగా రాగి కరుణాకర్, చిల్పూరు శ్రీధర్, పుప్పాల ఆంజనేయులు, ఏటూరి శేఖర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీసీ సంఘం మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా విజయ
హన్మకొండ చౌరస్తా: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ 7వ డివిజన్ లక్ష్మీపురానికి చెందిన ఆకుల విజయ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులను అందుకున్నారు.

‘పోటీ పరీక్షల’ పుస్తకం ఆవిష్కరణ
హన్మకొండ చౌరస్తా: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం హనుమకొండకు చెందిన హిస్టరీ సీనియర్ ఫ్యాకల్టీ శ్రీకాంత్ రాసిన పుస్తకాన్ని హనుమకొండలోని రామప్ప అకాడమీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, రామప్ప అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్ గౌడ్, ఫ్యాకల్టీ కమల్, రోహిత్, రాజు, ప్రవీణ్, శ్రావణ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విహారయాత్రలో యోగా సాధకులు
హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో యోగా సాధన చేస్తున్న సాధకులు విహార యాత్రకు వెళ్లారు. హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో 50మంది యోగా సాధకులు ఆగ్రా, మధుర, హరిద్వార్, రిషికేష్, ఢిల్లీ టూర్‌లో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోటను శుక్రవారం సందర్శించి ఆసక్తిగా వీక్షించారు.

లారీ సరుకు రవాణా ఖర్చులపై సమావేశం
వరంగల్ రూరల్: వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ కార్యాలయంలో అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, గౌరవ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, లారీ యజమానుల సంఘం నుంచి భూపాల్, అఫ్జల్, లారీ సప్లైయర్స్ అసోసియేషన్ నుంచి సమ్మిరెడ్డి, కార్యదర్శి సత్యం కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వరంగల్ మార్కెట్ నుంచి సరుకు రవాణాకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

దోషులకు పదేళ్ల జైలుశిక్ష
వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2019లో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలకు కారకులైన రాజస్థాన్ రాష్ట్రం గూలాబ్‌పూర్ జిల్లా బారథీయ గ్రామానికి చెందిన దోషులను పట్టుకోవటానికి వెళ్లిన క్రమంలో సీసీఎస్ అధికారులపై కర్రలతో దాడికి పాల్పడిన 11 మందికి అక్కడి కోర్టు 10పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధించింది. ఈమేరకు 17 మంది సాక్షులను విచారించిన అక్కడి కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

టెంట్‌హౌస్ సామగ్రి తిరిగి ఇవ్వడం లేదని బాధితుడి ఫిర్యాదు
వరంగల్ క్రైం: టెంట్‌హౌస్ నుంచి రూ.2 లక్షల విలువగల సామగ్రి తీసుకుపోయిన వ్యక్తి.. తిరిగి ఇవ్వడం లేదని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్‌పురకు చెందిన ఎండీ.మహబుబ్ ఫిర్యాదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు. వికాస్‌కుమార్ అనే వ్యక్తి సుప్రభ హోటల్‌లో అవసరం ఉందని సామాన్లు తీసుకుపోయి తీసుకురాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పేర్కొన్నారు.

మత్స్యకారుల సదస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ప్రకాశ్, నాయకులు

హన్మకొండ అర్బన్: ఈనెల 30న హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న మత్స్యకారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ నివాసంలో సదస్సు వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార వేదికగా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్‌తో పాటు అతిథులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో టీఎంకేఎంకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.